# ప్రయాణం

జీవితం ప్రయాణం లాంటిది.

ఎక్కడో ఎక్కి, ఎక్కడో దిగిపోవాల్సిందే.

కానీ మధ్యలో ఎన్ని ఆశలో-ఎన్ని నిరాశలో జీవితపు కడపటి వరకు.

ఆశ జీవించాలంటే ఓ నిరాశ కూడా అవసరం.

—జయప్రద

"అబ్బ లైఫ్ బోరు కొడుతోంది డాడీ!" ఎయిర్ కండీషన్ రూమ్‌తో ఖరీదయిన బల్ల ముందు కుషన్ కుర్చీలో కూర్చుని సన్నటి మ్యూజిక్ వింటూ 'తండూరి చికెన్' తింటున్న నన్ను కొడుకు మురళి దగ్గరనుంచి ఈరోజే వచ్చిన ఉత్తరంలోని ఆ వాక్యం కొద్ది కొద్దిగా తినేస్తోంది.

నన్ను అడగని ప్రశ్నకు 'నిన్నే నాన్నా జవాబు చెప్పు' అని ఆ ఉత్తరం నిలదీసి అడుగుతోంది.

మరో ప్రక్క వంటవాడు వినయంగా చేతులు కట్టుకుని నిల్చుని "చికెన్ బాగుందోయ్!" అంటే చాలు కళ్ళలో మెరుపును నింపుకోవడానికి సిద్ధంగా వున్నాడు.

"ఎన్నివేలు, ఎన్ని లక్షలు, ఎన్నికోట్లు అందిస్తే, నాకా ఆనందం దక్కుతుంది."

నన్ను మరలా మానసిక వ్యాధి క్రమంగా చుట్టేయ సాగింది. మరో మెతుకు కూడా నోటికెళ్ళనని భీష్మించుకుంది.

'అన్నం! అన్నం!' దేనికొరకయితే తను అహోరాత్రులు కష్టపడి సాధించాడో దాన్ని తలచుకుంటే అసహ్యమేస్తోంది. మధ్యలో లేచి ప్రక్కనే వున్న సింక్ దగ్గరకెళ్ళి చెయ్యి కడుక్కునే ఓపికకూడా లేక ప్లేట్లోనే కడిగేసుకున్నాను.

"అదేంటి సార్! కర్రీ బాగా కుదరలేదా?" దిగులుగా అడుగుతున్నాడు వంటవాడు.

నాకు జవాబు చెప్పాలనిపించలేదు. అసలు నోరు తెరచి ఏదయినా మాట్లాడడమనే విషయమే హఠాత్తుగా చాలా భారమయిందిగా అన్పించింది. లేచి నాలుగడుగులు వేసాను. నా వెనగ్గా దీనమైన నా వంటవాడి చూపులు నన్ను గుచ్చుకుంటున్నాయి.

"నాకు సుఖం కావాలి, నాకు శాంతి కావాలి, నాకు తృప్తికావాలి" అని పదే పదే ఆక్రోశించే నేను ఆ మాత్రపు తృప్తి, కనీసపు నా ఒక్క మంచి మాటతో వాడికి కలిగే పక్షంలో నేను ఆ మాత్రం శ్రమ తీసుకోకూడదా?

క్షణం ఆగాను. వెనక్కు తిరిగాను.

"బాగుందోయ్. చాలా బాగుంది. ఇంకా తింటే అజీర్ణం చేస్తుంది. అందుకే...." వాక్యం పూర్తి కానేలేదు వాడి కళ్ళు మెరిసాయి. వాడి పెదాలు విచ్చుకున్నాయి.

"వాడిలో ఎంత తృప్తి!" మరలా ఎక్కడో నా హృదయపు అట్టడుగు పొరల్లో వాడి ఎడల అసూయ.

"నాకులేని తృప్తి వాడికెందుకుండాలి?"

ఇక మరో క్షణంకూడా వాడి ఆనందాన్ని చూడలేని వాడిలా, గబగబ గది దాటేసి మరో విశాలమైన, ఖరీదయిన బెడ్‌రూమ్‌లో శక్తి లేనివాడిలా, నిర్వీర్యంగా, నిస్పృహగా, నీరసంగా ఫోమ్ బెడ్‌మీద వాలిపోయాను.

"నిన్నే డాడీ! నాకు అమెరికా చూచి రావాలనుంది." ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. అశాంతిగా అటూ యిటూ పొర్లాను. నిద్రకొరకు శక్తి కొద్దీ ప్రయత్నించాను. జేబులో సిద్ధంగా వున్న 'ట్రాంకు లైజర్స్' మింగాను. కానీ నా అశాంతి నా నిద్రను సైతం గెల్చుకుంది. వైద్య విజ్ఞానాన్ని పరిహసించింది.

"నాకు అమెరికా చూచి రావాలనుంది డాడీ! నిన్నే నాన్నా. జీవితం భలే విసుగేస్తుంది" విశాఖనుండి వచ్చిన ఆ ఉత్తరం నన్ను వెంటాడుతూనే వుంది. ఈ అశాంతి నుండి పారిపోవటానికి మరో మార్గం కనపడలేదు.

విసుగ్గా లేచి బెల్ నొక్కాను.

డ్రయివర్ చేతిలో డబ్బుంచి విశాఖకు టిక్కెట్టు తెమ్మన్నాను. వాడు నా వైపు చూచిన చూపు నాకు చాలా ఆనందంగా అన్పించింది. నాకు ఎదురు జవాబు చెప్పే అలవాటు లేని వాడు కళ్ళతోనే ప్రశ్నించాడు.

"ఈ డబ్బుతో ఫస్ట్‌క్లాసు టిక్కెట్టు రాదు కదా సార్!"

ఆ వినయం నేనిస్తున్న జీతాల విలువ అనీ, నా గొప్పతనమేమీ కాదనీ నాకు తెలుసు. కానీ దానిని నమ్మడానికి నేనెప్పుడూ ప్రయత్నించలేదు.

"నాకీరోజు సెకండ్ క్లాసులోనే వెళ్ళాలనుందోయ్. రిజర్వేషన్ కూడా వద్దు' వాడు తల వంచుకుని వెళ్ళిపోయాడు.

నేను మరలా బెడ్‌మీద వాలిపోయాను. కొద్ది మగత కనురెప్పల మీద పరుచుకుంటున్నట్లుంది. కానీ యిప్పుడు చిత్రంగా నిద్రపోవాలని కూడా అన్పించలేదు. అలా అని కళ్ళు తెరవాలనీ లేదు. ఎక్కడికయినా వెళ్ళాలని వుంది. మరలా బెడ్‌మీద నుండి లేవాలని లేదు. ఏదో చేయాలని వుంది కానీ ఆ ఏదోకి అర్థం నాకు తెలియడం లేదు.

"మీకు డిప్రెషన్ అనే మానసిక వ్యాధి ఇది. మిస్టర్ కృష్ణారావ్ మీరు ఎక్కువగా ఆలోచించకూడదు" అంటారు అంతా విని డాక్టర్లు. అందుకే ఈ మధ్య డాక్టర్లంటే విసుగ్గా వుంది.

"ఆలోచించకుండా వుండే ఉపాయం ఎందుకు చెప్పరు వాళ్ళు?"

ప్రక్కకు పొర్లాను. అమర పడక ఖాళీగా వుంది.

"నా అమర ఆ ఖాళీ ప్రక్కమీద ప్రత్యక్షమయితే....!"

బలమైన ప్రలోభం నన్ను చుట్టేస్తోంది. అందనిది కావాలని మనసు ఆక్రోశిస్తోంది. ఇన్నేళ్ళు మర్చిపోయిన అనుభవం కొరకు హృదయం ఆరాటపడుతోంది.

* ★ ★ ★

నా జరీ కండువాకీ, లక్షలు నాకిచ్చిన గాంభీర్యానికీ నేనదక్కుండానే సెకండ్ క్లాస్ రైలు పెట్టెలో కిటికీ ప్రక్క స్థలం దొరికింది.

దేనినయితే నేను మర్చిపోవాలని ప్రయత్నిస్తానో అదే గతం వెయ్యిరూపాలలో నన్ను చుట్టేయడం ఈరోజు కొత్త సంగతి కాదు.

★ ★ ★ ★

నడిమధ్య నడవలో వెలిసిపోయిన నాలుగుగోడల మధ్య, నాపరాళ్ళ నేలమీద తెల్లటి గుడ్డల్లో వెల్లకిలా పడుకున్న నిన్న మొన్నటి నా

శ్రీమతి నా జీవిత భాగస్వామి "నువ్వు లేకపోతే నేను బ్రతగ్గలనా అమరా!" అని నా చేత మురిపించుకున్న అమరావతి తుది ప్రయాణానికి సిద్ధమవుతోంది.

"ఏయ్! చూడు-నీ పెదాలెలా నల్లగా అయిపోయాయో! సిగరెట్లు మరీ అంతగా తాగకు కృష్ణా" అన్న నా యిల్లాలి లేత అధరాలు కమిలిపోయున్నాయి.

చిత్రంగా నా కళ్ళల్లో ఒక్క కన్నీటి బొట్టుకూడా లేదు. న తల్లి, నా అక్క, నా బావమరిది, అత్తగారు అందరూ ఏడుస్తున్నారు. ఈ దుఃఖం, ఈ భారం, ఈ శూన్యం నాలోనుండి ఒక్క కన్నీటిబొట్టు రూపంలో బయటకు రాలితే ఎంత బాగుణ్ను! ఎంత అదృష్టవంతులు వాళ్ళు!"

"పాపం పసిబిడ్డ తల్లిలేని వాడయ్యాడు" దూరాన ఎవరిదో సానుభూతి. నా బిడ్డ అర్థం చేసుకోలేనంత సానుభూతి.

అతనికి మాత్రం ఎంత వయస్సుంటుంది. మరో పెళ్ళి చేసుకోడూ? మరెవరిదో సమాధానం.

"ఆ....అతనికి భార్య వస్తుంది కాని బిడ్డకు తల్లి అవుతుందా" గుసగుసలు.

"ఎంత ముదనష్టపు జాతకం కాకపోతే పుట్టగానే తల్లినే పోగొట్టుకుంటాడు" మూఢత్వం తాలూకు నింద.

"అయినా నాయనా! నిన్ను చూస్తే గుండె చెరువైపోతోంది. తల్లిలేని బిడ్డను ఎలా సాకుతావు? తొందరలో పెళ్ళిచేసుకోవయ్యా" సందర్భం తెలియని ప్రేమ.

"అఁ ఎవరిస్తారు పిల్లని. అస్థా-పాస్థా" తగ్గు స్థాయిలో మరో గొంతు.

★ ★ ★ ★

ట్రెయిన్ కొద్దిగా ముందుకు వెనక్కు కదిలినట్లయి ఉలిక్కి పడ్డాను. ప్లాట్ ఫారంమీద ఒక సన్నటి సుకుమారమయిన అమ్మాయి కిక్కిరిసి పోయిన మా కంపార్టుమెంట్ వైపు నిరాశగా, దైన్యంగా, అసహాయంగా చూస్తోంది, ఇంజన్ కూత వేసింది. జనాన్ని తప్పించు కుని కంపార్టుమెంట్‌లో కడుగుబెట్టే సాహసం లేక ఎక్కకపోతే గత్యంతరం లేదన్నట్టు యింతవరకు నిస్సహాయంగా నిలిచిపోయున్న ఆ పిల్ల ఇంజన్ వేసిన కూతతో లేనిధైర్యం తెచ్చుకుని కమ్మీ పట్టుకుని కంపార్టుమెంటు మెట్టుమీద కాలు పెట్టేసింది.

★ ★ ★ ★

ఆనాడు భాగస్వామిని పోగొట్టుకుని ఆ అందమైన అమ్మాయి లాగే అసహాయంగా, నిలబడున్న నాకు, ఇంజను కూతలాగ, వాళ్ళ సానుభూతి వాక్యాలు ధైర్యాన్ని, చొరవని ఇచ్చాయి.

వాళ్ళంతా దురదృష్ట వంతుడనుకుంటున్న నా బిడ్డ అదృష్ట వంతుడు కావాలనీ, ఆ అదృష్టం డబ్బు రూపంలో తప్ప, మరిదేం ట్లోనూ లేదని నమ్మి జీవితంతో జూదమాడాను. తండ్రి ఇచ్చిన కొద్ది పాటి భూమిని అమ్మేసి ఆ ఊరు వదిలేసాను.

ది ★ ★ ★

ఆ అందమైన ఆమ్మాయి మెల్లి మెల్లిగా నేను కూర్చున్న బర్త్ కొసకు వచ్చి నిల్చుంది.

ధైర్యంచేసి ఎక్కేసిందేగాని, నిలబడే ఓపిక లేదని, చమటతో తడిసిన నుదురు ఆ తడిలో కదలాడే ఆలసట చెపుతున్నాయి.

"పాపం ఎంతసేపని నిల్చుంటావు? నేనీ స్టేషన్‌లో దిగిపోతు న్నాను. నువ్వు కూర్చుందువుగాని రామ్మా" ఒక మధ్య తరగతి ఇల్లాలి మాటలు ఆ అమ్మాయి కళ్ళల్లో వెలుగును నింపాయి.

ఆ సీట్ వదిలేస్తే, జీవితంలో ఇక తనకు కూర్చునే అవకాశం రాదేమో అన్నంత ఆత్రంగా గబుక్కున కూర్చుందాపిల్ల. కూర్చున్నాక ఆమె గుండెలనిండా గాలి పీల్చుకుంది.

★ ★ ★ ★

ఆ రోజు జనాల సానుభూతిని భరించలేక వున్న ఆస్తిని అమ్మి వ్యాపారం చేయాలని పరాయి వూరు వచ్చేసానేగాని, వ్యాపార విద్యలో ఓనమాలు రాని నేను, తెచ్చుకున్న డబ్బు, ఆ డబ్బుతోపాటు మన శ్శాంతినీ ఖర్చుచేసుకుంటూ బ్రతుకుతున్న రోజుల్లో–

తన సహాధ్యాయి కన్పించి, తనూ భాగస్వామి కొరకు వెతుకు తున్నట్లు చెప్పినప్పుడు, ఈః నాటి ఆ పిల్ల కళ్ళల్లోని వెలుగే ఆనాడు తన కళ్ళల్లోనూ ప్రతిఫలించి వుండాలి.

శ్యాముతో నా వ్యాపారం ఎలాటి ఒడిదుడుకులూ లేకుండా సాగి పోతోంది. నా బిడ్డ అదృష్టం కొరకు, స్పష్టమైనా దృక్పథం లేకుండా నేను జీవితంలో ఆడిన జూదంలో, ఓడిపోతానేమోనని బెంగ పెట్టుకున్న నాకు, తినడానికింత తిండి, కట్టడానికింత బట్ట, వుండడానికిల్లు లభిం చాయి. పాపాల సానుభూతి శబ్దాలు కాస్త తగ్గి మనశ్శాంతి లభించింది.

★ ★ ★ ★

ఆ అమ్మాయి అందమైన నేత్రద్వయం, అలసి నిద్రాభారంతో వాలిపోతోంది.

ఆమెకు దొరికిన జాగా చాలా చిన్నదిగా, ఇరుగ్గా వున్నట్టు ఆ స్థలంలో ఆమె అసహనంగా కదులుతోంది,

ఒరిగిపోతున్న ఆమె తల ఆధారం కొరకు వెతుకుతోంది. మెల్లిగా ఆమె ప్రక్కామె భుజంపై తల ఆన్చి కళ్ళు మూసుకుంది.

★ ★ ★ ★

కొంతకాల మయ్యాక తిండీ బట్టతో నేను సంతృప్తి పడలేక పోయాను. కృష్ణమూర్తి కేమి? మురళి ఎంత అదృష్టవంతుడు! అనేక శబ్దాలకొరకు ఎదురుచూస్తూ నా పట్టుదల, ఆత్మవిశ్వాసంతో, నా స్నేహితుని వ్యాపార చాతుర్యంతో కారు ఓనరు నయ్యాను. వుంటున్న అద్దె బంగళాకు స్వంతదారుణ్ణయ్యాను.

ఖరీదయిన ఫర్నిచర్‌తో దాన్ని నింపేసాను కొనాల్సింది ఇంకేమీ లేదన్నంతగా ఎదిగి పోయాను.

నా బిడ్డ అదృష్టానికి మనసులో అసూయతో పైకి ఆనందాన్ని వ్యక్తంచేసే నా బంధు బలగాన్ని చూచి గర్వంగా నవ్వుకున్నాను.

* * * *

ఆ పొదవాటి అందమైన అమ్మాయి ఉలిక్కిపడి మేల్కొంది. ఆమె తలకు ఇంతవరకు ఆధారమై, కొన్ని నిముషాలయినా విశ్రాంతి తీసుకోవడానికి ఆమెకు అవకాశ మిచ్చిన ప్రక్కామె చిన్ని భుజం, ఆమెకు ఇరుగ్గా, ముళ్ళ పాన్పులా అన్పించినట్లుంది.

తనకింత విశ్రాంతి నిచ్చిన ఆ భుజంమీద కృతజ్ఞత వుండాల్సింది పోయి విసుగ్గా, అసహనంగా ఆ భుజంవైపు క్షణం చూచి, ప్రక్కామె కాస్త ముందుకు జరగ్గానే దొరికిన స్థలంలో తల వుంచి, కాళ్ళు ముడుచుకుని, ఇంచుమించు సగం బర్త్‌మీద, సగం గాలిలో వున్నట్లు పడుకుంది.

* * * *

సర్వ కోరికల్ని నిక్షిప్తం చేసుకుని, ఏ లక్ష్యసాధన కొరకు, ఏ ఆనందానుభవం కొరకు, నేను ఎదురు చూదానో, అది నాకీనాడు సంపూర్ణంగా లభించింది.

కానీ నాకు సంతృప్తిలేదు. కేవలం ఇల్లు, వ్యాపారం, డబ్బు,

శ్యాము, మురళి ఈ పరిస్థితి నాకు చాలా ఇరుగ్గా, ఊపిరాడనట్టుగా వుంది.

నాకు వీటన్నిటితోపాటు హోదా కావాలి, కీర్తి కావాలి, కానీ శ్యాముకు వ్యాపారం, దాని అభివృద్ధి తప్ప మరో వ్యాపకంలేదు.

అందుకే అపురూపమయిన శ్యాము స్నేహం నాకు కాస్త విసుగ్గా అన్పించింది. నా పరిధిని పెంచుకున్నాను. డబ్బు వెదజల్లాను. త్రాగాను. త్రాగించాను. ఈ రోజుటికి రాజకీయంగా పెద్ద పదవిలోకి వెళ్ళిపోయాను.

★ ★ ★ ★

ఆ సుకుమారమయిన పొడవాటి అమ్మాయి-కాళ్ళు, జాపుకోవడానికి స్థలంలేక ఒరిగిపోతున్నాయి. ఆ ప్రక్కవాళ్ళ స్టేషన్ దగ్గరలో లేదు. అందుకే విసుగ్గా మరలా లేచి కూర్చుందా అమ్మాయి.

ఆ ఇరుకయిన కంపార్టుమెంటులో అరుదుగా దొరికిన కాస్తంత స్థలంతో సంతృప్తిపడలేని ఆ అందమయిన, సుకుమారమైన అమ్మాయిలాగే మన దేశంలో వేళ్ళమీద లెక్కపెట్టగలిగిన ధనవంతుల్లో, హోదా గలిగిన వాళ్ళల్లో ఒకడినైన నాకు ఆ ధనం, కీర్తి, హోదాకూడా తృప్తి నివ్వలేక పోయాయి.

ఇంకా ఏదో కావాలి, ఇంకా ఏదో పొందాలి, కానీ ఆ ఏదోకి అర్థాలు వెతుక్కోవడానికి, నా అశాంతికి కారణం తెలుసు కోవడానికి, నాకు పాతిక సంవత్సరాలు పట్టింది.

మురళికి నేనున్నాను. కానీ నాకెవరున్నారు? విధి విరామంలేని ఈ ఫోన్‌కాల్స్, వేళాతాళా లేకుండా రికమండేషన్ కొరకు పెట్టే దొంగ నమస్కారాలు, డొనేషన్ల కొరకు పొగడ్తలు, పార్టీలు ఇవేమీ నాకొద్దు.

కేవలం ఇంటికొచ్చేసరికి చిరునవ్వుతో ఎదురువచ్చే ఇల్లాలు

కావాలి. బోసిగా వున్న ప్రక్క పడకమీద పాతికేళ్ళనాడు పరమపదిం చిన నా అమర కావాలి.

నా కొరకు పరితపించే ఒకనాటి నా ఇల్లాలు, ముత్యంలాటి ఆ నాటి పసిబిడ్డ కొన్ని రోజులుగా నన్నాక్రమించుకొని, నా శాంతిని హరిం చేస్తున్న మనసుకు, మిగిలినవిచక్షణా జ్ఞానంతో పాఠాలు చెప్పుకుంటున్న రోజుల్లో, పడక మీదనుండి పుట్టెడు దిగులుతో లేచి, రోజల్లా ఎలాగో గడిపి, రాత్రికి ఏ ఆహ్వానమూలేని గూటికి చేరి కేవలం నిద్ర కొరకు కాసేపు పొర్లి ఆఖరున నిద్రమాత్రలతో కళ్ళు మూసేరోజుల్లో ఆ కలత నిద్రలో కూడా చనిపోయిన ఇల్లాలు కన్పించి, కవ్వించీ తీరా ఎంతో ఆశతో కళ్ళు తెరిస్తే శూన్యం మిగిలి వైరివాడవుతున్న రోజుల్లో వచ్చిన ఉత్తరమిది.

"డాడీ! జీవితం భలే విసుగేస్తోంది డాడీ!"

ఉలిక్కిపడ్డాను. ఏ జ్ఞాపకాలనయితే నెట్టివేయాలని నేను ప్రయ త్నిస్తున్నానో, అవి నన్ను అంతగా వెంటాడుతూనే ఉన్నాయి.

తల విదుల్చుకుని ఎదురు బెర్త్‌వేపు చూసాను.

ఆ అందమైన సుకుమారమైన అమ్మాయి ఎప్పుడు సంపాదించు కుందో స్థలం?

కాళ్ళు చాపుకొని గాఢనిద్రలో వుంది.

ఆమె నుదుటికి అంటుకున్న ముంగురులలో కూడా ఆమె సౌంద ర్యము పొర్లిపోతోంది.

ఇంత అందమయిన అమరలాంటి గుణవంతురాలయిన కోడలు కావాలి తనకు.

సిగ్నల్ ఇచ్చినట్లు లేదు.

రైలు మధ్యలో ఆగింది.

దూరాన విశాఖపట్నం అందంగా అగుపిస్తోంది.

క్షణం క్రితం నాలో మెదిలిన కోడలి ఊహాచిత్రం సౌందర్యపు ముసుగు ధరించిన ఆ ప్రకృతి నన్ను నా అందమైన అమర ఆలోచనల్లోకి లాగేస్తున్నాయి.

★ ★ ★ ★

ఉన్న చిన్న పెరట్లో మల్లెపందిరి క్రింద అరుగుమీద కూర్చుని మల్లెపూలను మాలగా గుచ్చుతున్న ఆమె వెనగ్గా సవ్వడి చేయకుండా వెళ్ళి భుజంమీద చేతులు వేస్తే, ఉలిక్కిపడి, వెనక్కి తిరిగి, నిర్భయంగా నిండుగా నవ్వే ఆనాటి పదహారేళ్ళ శ్రీమతి, తను ఆఫీసులో, ఆమె ఇంటిలో పనిచేసి, అలసిపోయి, ఎప్పుడో అర్ధరాత్రికి శరీరమూ, మనసూ ఏకమై భాషించుకొనే తరుణంలో....

'ఒకవేళ నేను చచ్చిపోతే నువ్వు మరలా పెళ్ళిచేసుకో అమరా" అని చప్పున నోరుమూసి, కళ్ళనిండా నీళ్ళునింపుకుని నాలో ఒదిగిపోయే నా అమర-

సినిమా హాల్లో దగ్గరగా జరిగి....

"సినిమాకంటే ఎంచక్కా నువ్వే బాగుంటావు" అంటే తెచ్చిపెట్టుకున్న కోపంతో బుంగమూతిపెట్టే ఆనాటి అర్ధాంగి-

శుక్రవారం తలారా స్నానంచేసి, ముదురురంగు వెంకటగిరి చీర కట్టుకుని, పూజకు వేళవుతుందని, వేలుముడి వేసుకుని హడావుడిపడే ఆమెను, ఆపుకోలేని తమకంతో, దగ్గరకు తీసుకోబోతే-'బాబు చూస్తాడు' అని కోప్పడినట్టే కోప్పడి వెంటనే సిగ్గుగా, తనలో ఇమిడిపోయే ఇల్లాలు ఆమె....ఆమె....నా శ్రీమతి....

నా అమర నాక్కావాలి.

ఎలా?

ఎలా??

ముత్యంలా, తెల్లగా' స్వచ్ఛంగా తయారయ్యి, ప్రక్క బెడ్‌మీద పడుకుని, చిలిపిగా నవ్వుతూ, అంతదూరాన తను ఆ మంచం కొస నుండి చెయ్యిచాపితే–కళ్ళతోనే రానట్టు నవ్వి వెంటనే దొర్లి వచ్చి తన బాహువుల్లో ఇమిడిపోయె శ్రీమతి ఇంకా బ్రతికున్నట్లే ఉంది.

ప్రక్క బెడ్‌మీద ప్రత్యక్షమైనట్టే వుంది.

ఫోన్ వస్తే అమర చేసిందేమోననే తెలిసిన భ్రమ నన్ను పిచ్చి వాణ్ని చేస్తోంది.

అమర లేని ఈ వైభోగాలు నన్ను వెక్కిరిస్తున్నాయి.

ఈరోజు మరలా స్త్రీ సాంగత్యం కావాలనిపిస్తోంది.

జీవితాన్ని నిత్యనూతనంచేసే-ఎప్పటికీ నిలిచిపోయే మధుర స్మృతి కావాలనిపిస్తోంద.

ఓ ఇరవయ్యేళ్ళ అందమైన అమ్మాయి భర్తగా, పదినెలల పసి పాపకి తండ్రిగా మిగిలిపోవాలనిపిస్తోంది.

కానీ నా ఊహాపధంలోని చిత్రం తిరిగి–తిరిగి అమరావతిగా మారిపోతోంది.

ఆ బిడ్డ మురళి అయిపోతున్నాడు.

"నువ్వు బ్రతికిరా అమరా! ఈ వైభోగాలన్నింటినీ వదిలి నా అమరను చేరుకోవాలి.

మేము మరలా పడుచుజంటగా మారిపోవాలి.

నాది పిచ్చి ఊహే–

కానీ ఆ పిచ్చిలోనుండి బయటపడాలనిపించడంలేదు.

అంతర్గతంగా నన్ను కొన్ని జ్ఞాపకాలు సొంతంగా వదలడం లేదు.

పాతిక సంవత్సరాలనాడు పరమపదించిన నా అమర నిలిచి పోయిన కోరికమీద, మర్చిపోయిన వయస్సుమీద ప్రభావం చూపిస్తూనే వుంది.

ఒకనాడు అద్దంముందు నిలుచున్నాను.

క్షణం నన్ను నేను పరిశీలనగా చూసుకున్నాను.

ఆనాటినుండి అది నా దినచర్య అయిపోయింది.

నా మనసు వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

నా కళ్ళల్లో కరిగిపోయిన కాంతి కావాలని ఆరాటం—

కళ్ళక్రింద నల్లటి వలయాలు మాసిపోవాలనే ప్రలోభం—

ఈనాటి చర్మపు ముడతల్లోఒకనాడా బతికిన శరీర లావణ్యం తిరిగి జనించాలనే కోరిక–తన బట్టలమీద....అనాడు శ్రీమతి ఆడుకున్న అందమైన జుట్టు ప్రత్యక్షమవ్వాలనే తపన....తీరేవి కాదని తెలిసి నా మనసు వెక్కి వెక్కి ఏడుస్తోంది.

నాకు రాని వార్ధక్యం నా శరీరానికి ఎందుకు రావాలని ఆక్రోశిస్తోంది.

నా మనసు పాతికేళ్ళనాటి యవ్వనం దాన్నింకా వదల్లేదు.

నాకు సుఖం కావాలి.

నాకు తృప్తి కావాలి.

నాకు తోడు కావాలి.

యాభయ్ సంవత్సరాలే వయసు నాది.

నా కోరిక చాలా అసందర్భమైంది.

నాకు తెలుసు–

ఆ కోరిక తీరాల్సిన రోజుల్లో నిర్లక్ష్యంచేసి, ఈరోజు దానికొరకు కన్నీళ్ళు నింపుకోవడంలో అర్థంలేదు.

అన్నీ నాకు తెలుసు....

అయినా కరిగిపోయిన కాలంలో బ్రతకాలనే పిచ్చితనం, ప్రలోభము నన్ను వదలడంలేదు.

దాని తాలూకు నిరాశ, నిస్పృహలు నన్ను చుట్టేసి నిర్వీర్యుణ్ని చేస్తున్నాయి.

అన్ని భోగాలనూ అందించే డబ్బు సంపాదించే ధ్యాసలో నేను స్త్రీని మర్చిపోయాను.

స్త్రీ ద్వారా నాకు మానసికంగా, శారీరకంగా కొన్ని అనుభూతులు కొన్ని అనుభవాలు లభ్యమవుతాయని నా శ్రీమతి నన్ను వీడిపోయిన నాడే మర్చిపోయాను.

నా మనసు అనాడు స్పృహకోల్పోయి ఈనాడు తెలివి తెచ్చు కుంది.

"నాకు సుఖంకావాలి. అనంతమైన తృప్తికావాలి. ఎవరమ్ముతారు చెప్పు శ్యామూ! ఎంత డబ్బయినా సరే...." అని తను ఆపుకోలేని నిరాశలో ఒకరోజు స్నేహితుణ్ని అడిగినపుడు వాడు నన్నపార్థం చేసుకున్నాడు.

నిజానికి నాకు నేనే అర్థంగాని మనఃస్థితి అది.

స్నేహితుడు పరిచయం చేసిన స్త్రీలో నాకు అమర కన్పించలేదు. నా అమరకంటే విశాలమయిన ఆ స్త్రీ నయనాల్లో నా అమర చిన్న కళ్ళల్లోని ఆపేక్షలేదు, వాటినిండా ఆశ వుంది.

వ్యాపారం పూర్తిచేసుకుని ఎప్పుడెప్పుడు తన చిన్నారి పాప దగ్గరకెళ్ళి పోదామా అనే తొందర వుంది. కొన్ని నిముషాలు గడవక ముందే బయటకొచ్చేసిన నన్ను నా స్నేహితుడు కొంతలో కొంత అర్థం చేసుకున్నాడనే అనుకున్నాను.

ఆ తర్వాత నాకో పసిపిల్లను చూపి, పెళ్ళిచూపులన్నాడు. ఆ అమ్మాయి కూడా చాలా అందంగా వుంది.

కానీ కొన్ని సంవత్సరాల క్రితం ఇలాగే పెళ్ళి చూపుల్లో, ఇదే వయసుతో ఒదిగి కూర్చుని, సంకోచంగా కళ్ళెత్తి నా కళ్ళు కలవగానే, నునుసిగ్గుతో, అదిరే పెదాలతో చప్పున తలవాల్చుకున్న అమరలా లేదా పిల్ల.

పులిని చూచి బెదురుతున్న లేడిలా వుంది. అసహాయమైన స్థితిలో శీలాన్ని పోగొట్టుకోబోతున్న ఓ లేడి కన్నెపిల్లలా వుంది. నా వయస్సులో ఆ పిల్ల వయస్సును పోల్చుకున్నాను.

నాకు నేను తండ్రి డిగ్రీ ఇచ్చుకున్నాను. అంతటితో నా స్నేహితుడు తన ప్రయత్నాలు మానలేదు. ఓ ముప్పయి సంవత్సరాల విద్యాధికురాలనూ, ముప్పయి అయిదు సంవత్సరాల భర్తృవిహీననూ కూడా చూపించి ఎన్నుకోమన్నాడు.

ఇద్దరూ కూడా నాకు నచ్చలేదు. కారణం వాళ్ళు భర్తృవిహీనులనీ కాదు, విద్యాధికులనీ కాదు. చనిపోయేనాటి నా అమర వయస్సు ఆ నాడు స్పృహ కోల్పోయిన నా మనస్సు వయస్సు.

వాళ్ళను మా కంటే పెద్దగా భావించాయి. ఆ సంగతి మాత్రం నేను బయట పెట్టదల్చుకోలేదు. ఈ సౌందర్యాలనూ, ఈ వైభోగాలనూ అమరతో మాత్రమే అనుభవించాలనీ, మరెవరో నా అమర స్థానంలోకొచ్చి అన్నిటినీ దోచుకోవడం నా అంతరాత్మ అంగీకరించడం

లేదనీ—నా అమర లేని ఈ సుఖాలు చాలా సిల్లీగా, భరించలేనంత వెగటుగా అనిపిస్తున్నాయనీ నా మరో అభ్యంతరాన్ని మటుకు చెప్పి నా స్నేహితుణ్ని నా పెళ్ళి ప్రయత్నాలనుండి విరమింప చేసాను.

కానీ నా అమర తిరిగి రాదు. నాకు తెలుసు.

ఒక్క పెద్ద కుదుపుతో రైలు కదిలింది.

విశాఖ తాలూకు అందమైన ప్రకృతిలోకి జరిగిపోతోందది. ఆ రైలు కుదుపుకు ఆ సుకుమారమైన అమ్మాయి లేచి కూర్చుంది.

చెక్కమీద పడుకున్న ఆ సుకుమారమైన ఒళ్ళు కందినట్లుంది. కందిన భాగాల్ని తడుముకుంటోంది విసుగ్గా.

ఆమె ఒంటి విరుపులో తనకు అందినది చాలదనేభావం స్పష్టంగా తెలుస్తోంది.

కేవలం ఆ పిల్ల-ప్రయాణం మొదలు పెట్టినప్పుడు ఆ కంపార్టుమెంటులో కాస్త స్థలం దొరికితే చాలనుకుంది.

కానీ ఈ క్షణంలో ఆమెకు అదనంగా అందినదంతా చాలా స్వల్పంగా అగుపిస్తోంది. నేనూ అంతే....జీవిత ప్రయాణంలో కేవలం ధనవంతుడనయితే చాలనుకున్నాను. కానీ ఈ నాడు నా అంచనాకు మించి నేను పొందిన ఈ ధనం తాలూకు సుఖాలు నాకేమాత్రం సంతృప్తి నివ్వలేక పోతున్నాయి.

నా జీవిత కాలమంతా ధనార్జనకే సరిపోతుంటే నాకి నిరాశ మిగిలేది కాదేమో! నా లక్ష్యం-నా మృత్యువుకంటే ముందు నెరవేరకుండుంటే బాగుండేదేమో!

నేను కోరుకున్న దేదయినా నాకు లభ్యం కాకుంటే ఇంత దుర దురదృష్టవంతుణ్ణయ్యేవాడినే కాదేమో!

నిట్టూర్చాను. స్పందించే హృదయాన్ని శపించుకుంటూ బయటకు చూదాను. విశాఖ స్టేషన్ ఎదురు వస్తోంది.

*　　*　　*　　*

"జీవితం భలే విసుగేస్తోంది. నాకు అమెరికా దూచి రావాలనుంది డాడీ" అందమైన విశాఖ బీచీలో కూర్చుని నా కొడుకు చేసిన కోరిక అది.

"అలాగే" అలవాటైన పదం నాలుక చివరిదాకా వచ్చి అగిపోయింది.

ఉహుఁ నాకీనాడేదయినా గాఢమైన కోరిక అది. తీర్చుకోవాలనే పట్టుదల మిగిలుండుటే–

చనిపోయిన భార్య తిరిగి రావాలనే వెర్రితనం నన్ను పిచ్చివాణ్ని చేసేది.

అమెరికా కవతల ఏముంది? కోరికలన్నీ తీరిపోయిన వెలితి, తర్వాత మిగిలే బోర్. డబ్బుకి, కీర్తికి, హోదాకి అవతల వున్న శూన్యం లాటి బోర్.

వాడికి తీరని కోరిక ఒకటి మిగిలి పోవాలి. అమెరికా అవతల వున్న ఓ గాఢమైన కోరిక, అందమైన ఆతృత, అపురూపమైన నిరీక్షణలో వాడు జీవితాన్ని నిత్యనూతనం చేసుకోవాలి"

అందుకే స్థిరంగా అన్నాను–

"నా కిష్టంలేదురా"

డాడీ!"

"నాలో వున్న శూన్యాన్ని నీలో నింపను. నా నైరాశ్యానికి నువ్వు వారసుడవు కావడానికి వీల్లేదు మురళీ."

వాడు చిత్తరువులా వింటున్నాడు. నా ఆవేశం వాడికీనాడు అర్థం కాదు. నాకు తెలుసు. కానీ ఈ రోజు బాధపడ్డ వీడు రేపు తప్పక సుఖ పడతాడు.

....అదే....అదే నేను కోరేది. కొంత కాలమైనా, కొంత కాలమైనా ఆ అమెరికా తాలూకు నిరీక్షణలో వాడిని ఆనందాన్ని వెతుక్కోనీ."

"నాన్నా!" వాడి కళ్ళల్లో నిరాశ. ఆ నిరాశ నన్ను బాధ పెట్టలేదు.

శూన్యం కంటే నిరాశ ఎంతో వాంఛనీయమైంది !

❋